
# విడిన మబ్బులు



"రేణుక ఒక్కపెట్టున పెట్టిన పెడబొబ్బలకు శారద తుళ్ళిపడింది. నాలుగంగల్లో వంటింట్లోనుండి హాల్లోకి వచ్చిపడింది. భర్త చేతిలో చావు దెబ్బలు తింటున్న కూతురు కంటబడింది. తల్లిని చూస్తూనే "అమ్మా" అంటూ తండ్రి చేతుల్లో నుండి బయట పడటానికి గింజుకుంటూ అరిచింది రేణుక.

శారద ఒక్క ఉదుటున కూతుర్ని భర్త చేతుల్లోనుండి గుంజుకొని దెబ్బలకు అందకుండా రేణుకను పొదువుకుని భర్తను అడ్డుకున్నది.

"పసిదాన్నెందుకలా కొడ్తారు?" అన్నది శారద.

"కొట్టాలా, చంపాలా! ఒకసారి చెప్తే బుద్ధి వుండక్కర్లా!" అరిచాడు కాంతారావు.

"ఏవన్నా తప్పుచేస్తే మందలించాలి గాని ఇలా కొట్టిచంపుతారా?" అన్నది నిరసనగా.

"పిల్లల్ని ఎలా పెంచాలో నీకే గాదు, నాకూ తెలుసు..... కాసేపు ఇంట్లో ప్రశాంతంగా వుండనివ్వరు. వెధవకొంపా, వెధవమనుషులూనూ, ఛీ...ఛీ" ఛీత్కరించి బెడ్‌రూమ్‌లోకి నడిచాడు కాంతారావు.

కాంతారావు ప్రవర్తనకు విస్తుబోయిన శారద అంతలోకే తేరుకుని కూతుర్ని తీసుకుని వంటింట్లోకి నడిచింది. ఇంతదాకా బిక్కు బిక్కుమంటూ ఓ మూలగా నిలుచున్న చిన్ని తల్లి కొంగుపట్టుకుని అనుసరించాడు.

రేణుక ఇంకా వెక్కిళ్ళు పెడ్తూనే వున్నది.

"ఊరుకోమ్మా.... మరి అల్లరిచేయొచ్చా!" అన్నది అనునయంగా కన్నీళ్ళు పైటచెంగుతో అద్దుతూ.

"నేను....అల్లరి.... చేయలేదమ్మా. బడిలో ప్రోగ్రెస్ కార్డ్ ఇచ్చారుగా.... చూడు నాన్నా అంటూ ఇవ్వబోయాను... పట్టుకుకొట్టారు" అన్నది బెక్కుతూ.

శారద మనసు చివుక్కుమన్నది.

ఇంత మాత్రానికే ఆయనకు కోపం రావాలా? అందుకు ఇంతగా దండించటం ఏమిటి? తనకు మంచి మార్కులు వచ్చాయని తండ్రి మెప్పు పొందాలని ఆశించి వుంటుంది. అదే క్షమించరాని తప్పా? చీటికి మాటికి అయిన దానికి కాని దానికి పిల్లల్ని దండిస్తుంటే వాళ్ళ మనసులు ఎంతగా గాయపడతాయో అర్థం చేసుకోవద్దూ!

మొన్నటికి మొన్న చిన్నిని పట్టుకు ఇలానే చావబాదేరు. వాడు చేసిన నేరం ఏముంది?

"నాన్నా! క్లాసులో ఫస్ట్ రాంక్ వస్తే బ్యాట్ కొనిస్తానన్నావుగా. మరి ఫస్ట్ రాంక్ వచ్చింది. ఎప్పుడు కొనిస్తావు"? అని అడిగాడు.

అంతే! వాడి మీద విరుచుకు పడ్డారు. "వేలెడు లేవు వెధవని, మీ చదువుకోసం వేలకు వేలు తగలెడ్తున్నది నన్ను వుద్ధరించటానికా? బుద్ధిగా చదువుకుంటే లక్షణంగా

బతుకుతావు. లేకుంటే అడుక్కుతింటావు" అంటూ ఆ పసివాడ్ని చితక తన్నటం ఏమైనా అర్థం వున్నదా?

అంతకు ముందెన్నడూ లేని విధంగా గత కొద్ది రోజులుగా ఆయన ప్రవర్తన ఆశ్చర్యకరంగా వున్నది.

ఆఫీసునుండి రావటం ఆలస్యం, పిల్లలిద్దర్నీ ఒడిలో చేర్చుకుని ఎంతగా ముద్దులాడే వారు! వాళ్ళకు ఎన్నెన్ని కబుర్లుచెప్పే వారు! ఇద్దర్లో ఎవరు తుమ్మినా, దగ్గినా ఆయన ప్రాణం ఎంత విలవిలలాడేది!

ఎంత అల్లరిచేసినా ఒక్కసారన్నా విసుక్కోవటం తను ఎరగదు. పిల్లలపట్ల అంత సహనం తనకు కూడా వుండేదికాదు. మరీ వాళ్ళ అల్లరి మితి మీరిందనుకుంటే తను మందలించటం ఆయన చెవినబడితే సహించలేక పోయేవారు. పిల్లలమీద ఈగ వాలనిచ్చేవారు కాదు.

వాళ్ళుకోరాలేగాని కొండ మీది కోతినయినా దింపుకు రావటానికి ఎప్పుడూ సిద్ధంగా వుండేవారు. పండగవస్తే చాలు. ముందు తమ సంగతెలావున్నా పిల్లలవంటి మీద క్రొత్తబట్టలు వుండాల్సిందే.

సెలవంటూ దొరకాలే గాని, పిల్లలతో సినిమాలకో, షికార్లకో బయలు దేరాల్సిందే. పిల్లల పట్ల ఆయన చూపుతున్న ప్రేమానురాగాలకు ఒకోసారి తనే వుడుక్కునేది.

"అవున్లెండి. ముందొచ్చిన చెవులకంటే వెనకొచ్చిన కొమ్ములు వాడి మరి" అన్నది దెప్పినట్లుగా.

"మరి రేపటి మన భవిష్యత్తుకి రక్షణ అవే గదుటోయ్" అంటూ ఒకటే నవ్వటం.

అంతగా పిల్లల్ని ప్రేమించేవ్యక్తి, ప్రాణం పెట్టే వ్యక్తి ఎందుకిలా ప్రవర్తిస్తున్నారు? వాళ్ళను చూస్తేనే కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారు.

ప్రేమగా చేరదియ్యటం లేదు. ముద్దు మురిపాలు లేవు. దగ్గరకు చేరితే చాలు కస్సున లేస్తారు. నోరు విప్పితే చాలు కొట్టినట్లు తిడ్తారు. అసలు పిల్లల పొడంటేనే గిట్టటం లేదు. ఏ అపరాధానికి వాళ్ళనిలా శిక్షిస్తున్నారో తనకే అర్థం కావడం లేదు.

నోరు విప్పి చెప్పకున్నా తనూ, పిల్లలూ ఆయనకు రెండు కళ్ళని తనకు తెలుసు. తొందరపడి ఎన్నడూ నోరుజారి ఒక్క మాటనని మనిషి. తన జీవితంలోకి అమాంతం నడిచి వచ్చిన అదృష్టంగా తనను ప్రేమిస్తారు.

పెళ్ళయిన తర్వాత పరాకుగానైనా ఒక్కసారి చిరాకుపడి ఎరుగరు. మనసును మాటలలో పొదగటం చేతరాకున్నా మౌనముద్రతోనే ప్రేమను వర్షిస్తారు. అలాంటి మనిషి ఏమిటిలా ప్రవర్తించడం!

ఆఫీసులో పనుల ఒత్తిడి వలన చికాకు పడుతున్నార్లెమ్మను కోవటానికి ఒక రోజు రెండు రోజులు కాదు. రోజు ఇదే వరస. పోని ఆర్థికపరమైన సమస్యలు ఏమైనా వచ్చినాయనుకోవటానికి అలాంటి అవకాశమే కనిపించటం లేదు. మరి ఈ విపరీత ప్రవర్తనకు ఏమిటి కారణం? తనతో మనసు విప్పి చెప్పుకోలేనిదా ఆ సమస్య? ఉండబట్టలేక ఓరోజు అడిగింది.

ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ పడుకునివున్న భర్తను చేతులతో చుట్టేసి "ఏమిటదోలా వున్నారు?" అన్నది శారద.

"ఎలాగేమిటి?" ఎదురు ప్రశ్న.

"దేన్ని గురించో బాధ పడుతున్నట్లున్నారు?"

"దేన్ని గురించీ?"

"ప్రశ్నకు ప్రశ్నే సమాధానమా?"

"ప్రశ్నకు అర్థంలేనప్పుడు!"

"అర్థంకానిది మీ ప్రవర్తన!"

కొద్ది నిమిషాలు మౌనం. కాంతారావు ఏమన్నా చెప్తాడేమోనని ఎదురు చూసింది శారద. కాని అతను అలాంటి ప్రయత్నమే చేయలేదు. అతని జుట్టులోకి వేళ్ళుజొనిపి, కళ్ళలోకి లాలనగా చూస్తూ అన్నది.

"ఏమండీ! నోరువిప్పి మీరు చెప్పకున్నా ఆ మాత్రం నేను అర్థంచేసుకోలేనా? భార్యంటే భర్త సుఖసంతోషాల్లో మాత్రమే వాటాపొందేది కాదు.... చెప్పండి" అంటూ భర్తను హృదయానికి దగ్గరగా తీసుకోబోయింది.

విదిలించుకున్నట్లుగా ప్రక్కకు జరిగాడు "ఏం, సూర్యోదయాన్ని నీ భర్తకోసం అడ్డుకుంటావా?" అతని కంఠంలో తొంగి చూసిన తిరస్కారం శారదను వణికించేసింది.

పొందిన అవమానంతో దుఃఖం ముంచుకొచ్చింది. కన్నీరు పొంగుకొచ్చింది. విసురుగా అవతలకు తిరిగి పడుకున్న కాంతారావు కన్నీటితెరలనుండి మసకమసగ్గా కనిపించాడు. ఆ రాత్రి ఆమె నిద్రపోలేదు.

◆ ◆ ◆

శారద పిల్లల్ని కాన్వెంట్‌కి పంపేందుకు అన్నీ సిద్ధంచేస్తున్నది. అదే సమయానికి ఆఫీసుకు తయారవుతూ పిల్లల్లో పిల్లవాడిగా 'అదేది, ఇదేది' అంటూ హడావిడి పెడ్తుండే భర్త తన అవసరమేలేనట్లుగా ప్రవర్తిస్తున్నాడు. అతని అవసరాలను తనే గుర్తించి సమకూరుస్తున్నది.

పిల్లవాడి చొక్కాకు గుండీలు పెడ్తున్న శారదకు తటాలున గుర్తొచ్చింది. భర్తచొక్కా గుండీ ఒకటి ఐరన్ చేస్తున్నప్పుడు ఊడిపోయిందని. క్రొత్త గుండీ వేద్దామనుకున్నది కాని అంతలోనే మర్చిపోయింది. ఆఫీసుకు వేసుకెళ్ళేందుకు ఐరన్ చేసినచొక్కా ఒక్కటే వున్నదని గుర్తొచ్చి గభాల్న లేచివెళ్ళింది.

ఆమె వెళ్ళేసరికి కాంతారావు చొక్కాకు గుండీ కుట్టుకోవటానికి తంటాలుపడ్తూ కనిపించాడు.

అదేసమయంలో ఆమె దృష్టి భర్త భుజం మీద పడింది. రాగివర్ణంలో నిగనిగలాడుతున్న మచ్చ ఆమె కంట బడింది. కొద్ది క్షణాలు ఆమె మనసు మొద్దుబారినట్లయింది. అంతలోనే తేరుకున్నది.

భర్త చేతిలో నుండి చొక్కా అందుకున్నది "ఈ మాత్రం పనికి కూడా నేను తగననుకున్నారా?" అంటూ సూది, దారం తీసుకున్నది.

గబగబా గుండీ కుట్టింది. భర్తకు అందిద్దామని చూసేసరికి మాసిన చొక్కానే వేసుకు వెళ్తూ కనిపించాడు. ఇలాంటి తిరస్కారాలకు అలవాటు పడుతున్నది గనుక దుఃఖాన్ని దిగమింగుకున్నది.

పిల్లల్ని కాన్వెంట్‌కి పంపగానే మంచం మీద నిస్తేజంగా వాలిపోయింది. ఆమె మనసు మనసులో లేదు.

అంతకు ముందు భర్తవంటి మీద చూసిన మచ్చ ఆమెను గత స్మృతులలోకి లాక్కెళ్ళింది. స్నేహితురాలు ఉమ గుర్తొచ్చింది.

ఉమ, తనూ ఒకే కాలేజీలో చదివారు. హాస్టల్ రూమ్మేట్సు కూడా. ఇద్దరూ ప్రాణ స్నేహితులు.

ఒక రోజు ఉమ తలంటు స్నానం చేసి జుట్టు చిక్కు తీసుకొంటున్నది. శారద అప్పుడే చూసింది. ఉమ మోచేతి మీద రూపాయికాసంత మచ్చ. నిగనిగ లాడుతూ రాగివర్ణంలో స్పష్టంగా కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది.

"ఏయ్! ఏమిటే ఆ మచ్చ?" అడిగింది.

"ఓస్ ఇదా! ఈ మధ్యనే కనిపిస్తున్నది. సోబి మచ్చలాంటిదయి వుంటుంది. అదే పోతుందిలే" అన్నది నిర్లక్ష్యంగా

కాని శారద ఆ మచ్చను తేలిగ్గా తీసుకోలేకపోయింది. ఆ మధ్యనే ఒక మెడికల్ జర్నల్‌లో చర్మ వ్యాధుల గురించి ప్రచురింపబడిన వ్యాసం చదివివున్నది.

"ఉమా! ఆరోగ్యం గురించి నిర్లక్ష్యం పనికిరాదు. ఎందుకైనా మంచిది డాక్టర్‌కి చూపించుకో రాదుటే".

"సర్లేపోవే, నీకు ప్రతిదీ కంగారే. ఈ మాత్రం దానికి డాక్టర్ల చుట్టూ ఎవడు తిరుగుతాడు" అంటూ శారద సలహాను పెడచెవిన పెట్టింది.

అయినా శారద వదిలిపెట్టలేదు. ఆమె మనసును ఏవో అనుమానాలు స్థిమితంగా వుండనివ్వలేదు. ఒకటి రెండు సార్లు హెచ్చరించినా ప్రయోజనం కలగలేదు.

"ఏమే మచ్చ దురదగా లేదూ?" అడిగింది

"ప్చ్! నీ బుద్ధి మారదే తల్లీ. ఏ దురదా లేదు, బాధాలేదు" చెప్పింది ఉమ.

శారద తను ప్రాక్టికల్స్‌లో వుపయోగించే బ్రష్ తీసుకొచ్చింది.

"నువ్వు నోర్మూసుకుని కాస్త బుద్ధిగా కూర్చో" అంటూ కసిరి, ఉమ చేయి పట్టుకున్నది.

"ఏం తల్లీ నీ ప్రయోగాలకు నేనే దొరికానా?"

"షటప్!.... ఈ మచ్చకూ, మిగిలిన చర్మానికి స్పర్శలో ఏమైనా తేడావున్నదా, ఒకేలా వున్నదా చెప్పు" అంటూ బ్రష్‌తో పరీక్షించింది.

"అవునే, ఈ మచ్చమీద మొద్దుగా అనిపిస్తున్నది. స్పర్శఅంతగా తెలీటం లేదే" అన్నది ఆశ్చర్యంగా

శారద ఉలిక్కిపడింది. కొద్దినిమిషాలు నోటమాట రాలేదు.

"చెప్పవే! ఇది ఏం మచ్చ?" అడిగింది ఉమ.

శారదకు ఏం చెప్పాలో తోచలేదు. గదికి తాళం పెట్టి ఉమను లైబ్రరీకి లాక్కెళ్ళింది. పిరియాడికల్స్ సెక్షన్‌లో వెతికి, ఒక పాత మెడికల్ జర్నల్ తీసి ఉమ చేతిలో వుంచింది.

"ఇదుగో ఈ వ్యాసం చదివి రూంకి రా. అదేమిటో నీకు అప్పటికీ తెలియకుంటే నేను చెప్తాను" అంటూ గదికి తిరిగొచ్చింది.

కొద్దిసేపటికి ఉమ తిరిగొచ్చింది. వస్తూనే మంచం మీద బోర్లా పడిపోయి వెక్కి వెక్కి ఏడ్వసాగింది. ఆమెను ఓదార్చటం శారద వల్ల కాలేదు.

"ఊరుకోవే! ఈ మాత్రానికే అధైర్యపడితే ఎలా?" అన్నది ఒడిలోకి తీసుకుని.

"నా బ్రతుకేం కానే! నేను బ్రతికి ఏమిటి సాధించేది" అంటూ ఒకటే ఏడవటం.

"భయపడకే! ఎవరైనా స్కిన్ స్పెషలిస్ట్‌కి చూపెడతాం. తప్పక తగ్గిపోతుందని నా నమ్మకం."

"ఈ జబ్బు కుదర్చటం ఎవరివల్లవుతుందే! రోజూ వీధుల్లో భిక్షమెత్తుకుంటూ ఎంత మంది కనిపించటం లేదు. ఆ వికృత రూపాల్లో నన్ను నేను వూహించుకోలేనే. నా బ్రతుకే వ్యర్థం" అంటూ భోరున ఏడ్చేస్తున్నది.

శారద కళ్ళల్లో నీరు పొంగి పొర్లింది. "ఉమా! సాయంత్రం డాక్టర్ దగ్గరకు వెళ్దాం. పిచ్చి పిచ్చి ఆలోచనలతో మనసు పాడుచేసుకొనకు" అంటూ సముదాయించ బోయింది.

"వద్దే. ఏ డాక్టరు దగ్గరకూ వద్దు. ఎవరూ బాగుచేయలేని వ్యాధి ఇది. నేను చచ్చిపోతాను".

డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళాలని శారద ఎంత ప్రయత్నించినా ఉమ లొంగిరాలేదు. వేళకు తిండీతిప్పలు లేకుండా నాలుగు రోజులకే నెలరోజులు లంకణాలు పడ్డదానిలా తయారైంది. ఉమకు ఎలా నచ్చచెప్పాలో శారదకు అంతుబట్టటంలేదు.

ఒకరోజు రాత్రి నిద్రపోతున్న శారదకు హఠాత్తుగా మెలకువ వచ్చింది. కళ్ళువిప్పి చూసేసరికి ఉమ ఏదో సీసామూత తీయటానికి ప్రయత్నం చేస్తూ కనిపించింది.

"ఏమిటే అది!" అంటూ గభాల్న లేచి కూర్చున్నది.

"అబ్బే! ఏం.... లేదే.... తలనొప్పిగా.... వుంటేను" అంటూ సీసా కనపడకుండా దాచబోయేసరికి అనుమానం వచ్చింది.

ఒక్క గెంతులో ఉమ దగ్గరకువెళ్ళి సీసా చేతిలోనుండి అమాంతం లాక్కున్నది. ఇండికేషన్స్ చదివి శారద గుండెజల్లుమన్నది. ఓవర్‌డోస్ తీసుకుంటే ప్రాణాన్నే హరించే బిళ్ళలవి.

"ఏమిటే నువ్వు చెయ్యబోతున్నది?" శారద కళ్ళు కోపంతో ఎరుపెక్కాయి.

"ఆ సీసా నాకిచ్చెయ్... అసలు నాజోలి నీకెందుకు. నేచస్తే నీకేం, బ్రతికితే నీకేం" అంటూ శారదమీదకు దూకి సీసా లాక్కోబోయింది.

శారదలో సహనం నశించింది. ఉమను పట్టుకుని ఎడాపెడా నాలుగు దెబ్బలు వేసింది.

"ప్లీజ్ శారూ! నన్ను చావనీవే!" అంటూ గొల్లుమంది.

"డోన్ట్‌బి ఇడియాటిక్! నే చెప్పిన మాట వినినిపక్షంలో ఉదయమే మీ ఇంటికి టెలిగ్రాం ఇస్తాను. వార్డెన్‌కి రిపోర్టు చేస్తాను. అనవసరంగా అల్లరిపడతావు. చెప్పు. నన్నేం చేయమంటావ్?" గద్దించింది శారద.

కొద్దిసేపటి తర్వాత, "నువ్వు చెప్పినట్లు వింటానే" అన్నది ఉమ.

ఉమను మర్నాడే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళింది. ఆయన పరీక్ష చేశాడు. ఉమ మానసికస్థితి గురించి డాక్టర్‌కు వివరించింది శారద.

"చూడమ్మా! కుష్ఠు వ్యాధి నువ్వూహిస్తున్నంత భయంకరమైన వ్యాధికాదు. అది కూడా 'మైకో బేక్టీరియమ్ లెప్రీ' అన్న సూక్ష్మజీవి వలన సంక్రమించే ఒక చర్మవ్యాధి మాత్రమే. సకాలంలో గుర్తించి, చికిత్స పొందటం వలన సులభంగా తగ్గిపోయే వ్యాధి.

ఇందులో అంటువ్యాధి అయినది, కానిది అని రెండు రకాలున్నాయి. వందమంది రోగగ్రస్తులలో సుమారు పదిశాతం మాత్రమే అంటు వ్యాధి రకానికి చెందుతారు. నీది అంటువ్యాధి రకం కానిది. కుష్ఠు రోగులు అనగానే కాళ్ళు, చేతులు దెబ్బతిని వికృత రూపంతో వీధుల్లో భిక్ష మెత్తుకునే వాళ్ళే గుర్తొస్తారు ఎవరికైనా. నిజానికివాళ్ళ దుస్థితికి కారణం వ్యాధికి సరైన చికిత్స లేకపోవటంకాదు. చికిత్సపట్ల వాళ్ళ నిర్లక్ష్యమే అందుకు కారణం. నీకు సులభంగా తగ్గిపోతుంది. భయాందోళనలు చెందనవసరం లేదు" అంటూ డాక్టర్ ఎన్నో విషయాలు చెప్పారు.

డాక్టర్ మాటలు ఉమ మీద బాగా పనిచేశాయి. వ్యాధి గురించి ఒక అవగాహన రావటంతో ఆమెలో వున్న భయం తొలగి పోయింది. జాగ్రత్తగా చికిత్స తీసుకున్నది. రెండేళ్ళలోనే వ్యాధి పూర్తిగా తగ్గిపోయింది. అయినా ముందు జాగ్రత్తకోసం ఆ డాక్టర్ మరో ఏడాది మందులు వాడించారు.

డిగ్రీ పూర్తి అయిన తర్వాత వీడ్కోలు చెప్తూ "శారదా! నీకు ఆజన్మాంతం కృతజ్ఞురాలనే. నీవు ధైర్యం చెప్పకుంటే అప్పుడే నా కథముగిసేది. నీ వంటి స్నేహితురాల్ని పొందటం ఒక వరం" అంటూ కన్నీళ్ళు పెట్టింది.

ఇప్పుడు ఉమ జీవితంలో స్థిరపడిపోయింది. సహృదయుడైన భర్తతో, ముత్యాల్లాంటి పిల్లలతో సలక్షణంగా వున్నది. తరచూ ఉత్తరాలు రాస్తుంటుంది. అవకాశం దొరికినప్పుడు రెక్కలు కట్టుకుని వాలిపోతుంటుంది.

భర్త మానసిక స్థితికి, వంటి మీద కనిపిస్తున్న మచ్చకు ఏమైనా సంబంధం వున్నదా? ఆ మచ్చ ఏమిటన్నది గుర్తించి, వ్యాధి పట్ల సరైన అవగాహన లేకపోవటం వలన ఆయన భయానికి గురై ఇలా ప్రవర్తిస్తున్నారా? అసలు డాక్టర్ని సంప్రదించారా లేదా? ఆ రోజంతా ఆలోచిస్తూనే వున్నది శారద.

◆ ◆ ◆

పిల్లలు ఆదమరచి నిద్రపోతున్నారు. శారద ఇల్లంతా సర్ది తలుపులు వేసి వచ్చి డబుల్ కాట్ మీద పడుకున్నది. కాంతారావు ఏదో పత్రిక తిరగేస్తున్నాడు. భర్తకు చేరువగా జరిగి మీద చేయి వేసింది.

"మీ భుజం మీద మచ్చకనిపిస్తున్నది. ఏమిటో పరీక్ష చేయించుకున్నారా?" అడిగింది శారద.

కాంతారావు చేతుల్లో నుండి పుస్తకం జారిపడింది. అతని కళ్ళల్లో భీతి తొంగి చూస్తున్నది. ముఖంలో కొద్దిగా కలవరం కనిపిస్తున్నది.

"అదా...ఏదో... అదేపోతుందిలే" అతని మాటలు తడబడ్డాయి.

"అని మీరనుకుంటున్నారా. డాక్టర్ చెప్పాడా?"

కాంతారావు మాట్లాడలేదు. ముఖాన్ని ప్రక్కకు తిప్పుకున్నాడు. తన ముఖంలోని భావాలను భార్య పసిగట్టటం అతనికిష్టం లేనట్లుంది. అతని ప్రవర్తన శారద అనుమానాలను ధ్రువపరుస్తున్నట్లయింది.

ఒక స్నేహితుని ద్వారానో, లేదా మిడిమిడిజ్ఞానంతోనో ఆ మచ్చను కుష్ఠు వ్యాధిగా గుర్తించి వుండాలి. అనుమానాలతో, అపోహలతో మనసును వికలం చేసుకుంటూ వుండాలి. డాక్టర్నే గనుక కలిసి వున్నట్లయితే ఇలా పిరికిగా వుండేవారు కాదు. ఆనాడు ఉమను రక్షించుకున్నట్లుగా భర్తను రక్షించుకోవాలి. అది తన బాధ్యత.

"మీరు డాక్టర్‌కు చూపెట్టలేదు".

"........................."

"అయితే, ఆ మచ్చ ఏమిటనేది మీకు తెలుసు. మీ విపరీత ప్రవర్తనకు అదే కారణమని నేను ఊహించగలను.... చెప్పండి" అంటూ అటు తిరిగి వున్న భర్తను ఇటు బలంగా తిప్పుకున్నది.

భర్త కళ్ళల్లో నీటి సుడి. అతని బేలతనానికి శారదకు జాలి వేసింది. "ఇప్పటికీ నిజం చెప్పరా?" అడిగింది లాలనగా.

కాంతారావు గొంతు పెగిలింది. "నీ ఊహ నిజమే శారదా! టెన్నిస్ కోర్టులో ఒక స్నేహితుడు చూసి హెచ్చరించాడు. స్పర్శజ్ఞానం కోల్పోయే మచ్చలే కుష్ఠువ్యాధి ప్రారంభ లక్షణమని, ఎందుకైనా మంచిది అశ్రద్ధ చేయకుండా డాక్టరికి చూపించుకోమన్నాడు. నేనుగా పరీక్ష చేసి చూసుకుంటే అతని అనుమానం నిజమని తెలుసుకున్నాను. డాక్టర్‌కి కూడా చూపించుకునే ధైర్యం లేక పోయింది" అన్నాడు.

"అప్పటి నుండి మనసు పాడుచేసుకుంటూ ఏవేవో పిచ్చి ఊహలతో అశాంతికి గురవుతున్నారు కదూ!"

"అవును శారదా! బజార్లో ఆ వ్యాధివున్న వాళ్ళు కనిపించినప్పుడల్లా నన్ను నేను వారిలా ఊహించుకుంటూ, మీకూ ఈ వ్యాధి వస్తుందేమోనన్న భయంతో మీ పట్ల కర్కశంగా ప్రవర్తిస్తూ, మీకు దూరంగా వుండటానికి ప్రయత్నించాను. నా బ్రతుకు ఏమైనా మీరంతా సుఖంగా వుండాలి" అన్నాడు వేదనగా కాంతారావు.

శారద మెల్లగా నవ్వింది "అర్థంలేని అపోహలతో మిమ్మల్ని మీరే హింసించుకున్నారు. నా ఫ్రెండ్ ఉమ మీకు తెలుసుగదా! మేం కాలేజిలో చదువుకునే రోజుల్లో దానికి ఇలానే వచ్చింది. ముందు మీలానే కృంగిపోయింది. సరైన చికిత్సతో పూర్తిగా ఆ వ్యాధిని పోగొట్టుకున్నది. ఉమకన్నా నిదర్శనం మీకు ఏం కావాలి?" అంటూ ఉమ గురించిన సంగతులన్నీ వివరించి చెప్పింది కాంతారావుకు.

"శారదా! ఇంతవరకు నేనెంత మూర్ఖంగా ఆలోచించానో తలచుకుంటుంటే నాకే సిగ్గు వేస్తున్నది. నా బ్రతుక్కే అర్థం లేకుండా పోయిందని, బ్రతకటమే వ్యర్థం అనీ అనుకున్నాను. డాక్టర్ దగ్గరకు వెళ్దాం" అన్నాడు ఉత్సాహంగా.

మర్నాడు ఇద్దరూ వెళ్ళి డాక్టర్ని కలుసుకున్నారు.

కాంతారావుకు కుష్ఠువ్యాధి పట్ల వున్న అపోహలన్నీ తొలగిపోయాయి. ఇప్పుడతను ఏమాత్రం భయపడటంలేదు. జీవితం ఇప్పుడతనికి స్వర్గతుల్యంగానే కనిపిస్తున్నది. ఏ విధమైన అనుమానాలు పీడించటం లేదు. ఎప్పటిలానే భార్యా పిల్లలతో ఆనందంగా గడిపేస్తున్నాడు.

❋

*(స్వాతి సపరివార పత్రిక, 14 ఫిబ్రవరి 1986)*